క్లుప్తంగా

5న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

కురుపాం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆరిక సుందరరావు ఆదివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ స్టడీస్, సైన్స్ సబ్జెక్టులతో ప్రశ్నలు ఉంటాయని, మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పరీక్షకు హాజరు కావాలని కోరారు.

విధినిర్వహణలో చిత్తశుద్ధి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్జీదారులకు అందించాల్సిన ధ్రువపత్రాలు సిద్ధం చేయటంలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. డిప్యూటీ తహసిల్దార్ బి.బుచ్చయ్య నేతృత్వంలో అధికారులు, సిబ్బంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ప్రజలు కోరుతున్న కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు భూ సంబంధిత పాస్ పుస్తకాలు, ముటేషన్లకు సంబంధించిన పత్రాలు సిద్ధం చేసేందుకు ఆదివారం కూడా విధులకు హాజరయ్యారు.

నేటి రీసర్వే సమాచారం

పాలకొండ రూరల్: సమగ్ర భూసర్వేలో భాగంగా సోమవారం పాలకొండ పట్టణ పరిధిలో సర్వే నంబర్ 155,167 నుంచి 170 వరకు, 349 నుంచి 355 నంబర్ల మధ్య ఉన్న భూముల్లో రీసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సర్వే నంబర్లు కలిగిన భూ హక్కుదారులు, రైతులు సమగ్ర సమాచారంతో ఉదయం 7 గంటలకు తమ భూముల వద్దకు చేరుకుని సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

బాధ్యత పెరిగింది..

● జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు

సాలూరు: మున్సిపాలిటీ సచివాలయ కన్వీనర్‌గా నియమించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి అప్పగించిన మంత్రులు పీడిక రాజన్నదొర, బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం విశిష్టతను ఇంటింటికీ వివరిస్తానని చెప్పారు. మున్సిపాలిటీలో శనివారం ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమంలో దేవరవీధి సచివాలయంలో 549 సర్వీసులు, కోటవీధి సచివాలయంలో 945 సర్వీసులు అందించినట్లు తెలిపారు. మహంతివీధి, గాంధీనగర్ ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాచిపెంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఫక్రుద్దీన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా పాచిపెంటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై వెంకటరమణ పాలకొండ నియోజకవర్గం వీరఘట్టాం పీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

8న దివంగత వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జూలై 8వ తేదీన పార్వతీపురం పట్టణంలో ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న వైఎస్సార్ విగ్రహ నిర్మాణం ఏర్పాట్లను ఆదివారం ఆయన దగ్గర ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ 10 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటుతో ఒక వైపు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం, మరో వైపు పార్వతీపురం నియోజకవర్గం కొత్తశోభ సంతరించుకోనున్నాయని తెలిపారు. మరో రెండు రోజుల్లో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం కార్యాచరణను ఖరారు చేసి పార్టీ శ్రేణులకు పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర 'భూరక్ష' 'భూ హక్కు' సర్వే పనుల్లో పాల్గొనేందుకు గ్రామాలకు వస్తున్న రెవెన్యూ, సర్వే అధికార సిబ్బందికి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీరమణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ రక్ష, భూ హక్కు పథకాన్ని అమలు చేసిందన్నారు. రెండు సర్వేలు పూర్తి చేసిన గ్రామాల భూముల్లో రోవర్ విధానం ద్వారా సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాళ్లు అమర్చే సమయంలో భూములకు చెందిన రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిధులతో సమకూర్చిన సర్వే రాళ్లను రైతులు పదిలం చేసుకున్నప్పుడే భూ వివాదాలను నిరోధించవచ్చని తహసీల్దార్ ఎన్వీరమణ అన్నారు. భూముల్లో రీసర్వే నిర్వహించడానికి, సర్వే రాళ్లు వేయడానికి రెవెన్యూ, సర్వే సిబ్బంది గ్రామాలకు వస్తున్నట్లు తెలియజేశారు.

అందుబాటులో ఆరోగ్యం



గులిమి నేరేడు పండ్లు

- ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధ ఫలాలతో ఆరోగ్యం
- రసాయనాలు, క్రిమిసంహారక అవశేషాలు లేని మధుర ఫలాలు
- మార్కెట్లో మంచి డిమాండ్



బొప్పాయి



జామ

భామిని: సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంత ముఖ్యమో సరైన ఆహారం తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆహారంలో వివిధ రకాల పండ్లు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. రోజుకు ఒక పండు తింటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. క్రిమిసంహాలు, ఎరువులు వినియోగించకుండా ప్రకృతి ఒడిలో పండిన పండ్లయితే మరీ మంచిది. ఏజెన్సీ ప్రాంతంలో తివ్వాకొండల్లో ప్రకృతి సిద్ధంగా పండే పండ్లను గిరిజనులు ఆహారంగా తీసుకోవడంతో పాటు వాటిని విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో లభించే నేరేడు, జామ, బొప్పాయి, నారింజ, నిమ్మ, ఉసిరి, సపోటా, సీతాఫలం, అరటి, పైనాపిల్, పనస తదితర పండ్లకు మార్కెట్లో మంచి గిరాకి ఉంది. వీటిని తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ ఫలాలు వాటి ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం.

నేరేడు..

నేరేడు పండులో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తి మెరుగవడానికి తోడ్పడతాయి. సుగర్ వ్యాధి గ్రస్తులు వీటిని తీసుకోవడం ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో ఉంచుకోవచ్చు.

నారింజ

ఇది సిట్రస్ జాతికి చెందిన ఫలం. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో అగ్రగామిగా ఉంటుంది.

నిమ్మ

ఇందులో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. ఇది వైరస్, బాక్టీరియాల నుంచి శరీరాన్ని కాపాడేందుకు చాలా అవసరం.

కొండ అరటి పళ్లు

ఏజెన్సీలో పండే అరటి పండ్ల రుచే వేరు. ఇందులో పోటాషియం అధిక మోతాదులో ఉంటుంది. వీటిని నిత్యం తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలోకి వస్తుంది.

జామ

జామలో విటమిన్–ఎ,సి అధికంగా ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. వయసు పైబడిన వారిలో వచ్చే కంటి సమస్యలను నివారించేందుకు ఉపకరిస్తుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండడం వల్ల మలబద్దకం సమస్య మాయమౌతుంది.

బొప్పాయి

బొప్పాయిలో పెపైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీని వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవడంతో పాటు అందులోని పోషకాలు రక్తంలోకి చేరడంతో శరీరానికి శక్తినివ్వడంతో పాటు రోగనిరోధక శక్తిని ప్రభావవంతంగా ఉంచుతుంది.

ఉసిరి

ఉసిరిలో యాంటీ బాక్టీరియల్, రక్తస్రావ నివారిణి లక్షణాలు ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచే గొప్ప ఔషధం. సీ–విటమిన్ అధికంగా ఉంటుంది.


పండ్లతో ఆరోగ్యం పదిలం



కృత్రిమ రసాయనాలు లేని స్వచ్ఛంగా పండిన ఫలాలు ఆరోగ్యానికి మంచిది. ఏజెన్సీలో ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లలో ఎటువంటి క్రిమిసంహారకాలు, ఎరువుల అవశేషాలు లేకుండా స్వచ్ఛంగా ఉంటాయి. ఇవి రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మంచివి. ప్రతి రోజు పండ్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

– డాక్టర్ కె.విజయపార్వతీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ, పాలకొండ

● శాకంబరిగా దుర్గమ్మ



మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొలువుతీరిన శ్రీదుర్గా అమ్మవారి ఆలయంలో ఆషాడమాస కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సమర్పించిన పండ్లు, కూరగాయలను అర్చకులు బంకుపల్లి ప్రసాద్ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.

– పాలకొండ రూరల్

వాలుగా దున్నుకుంటే మేలు

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు బిజీ అయిపోయారు. వరి విత్తనాలు ముందస్తుగా సరఫరా చేయడంతో పాటు వర్షాలు అనుకూలంగా కురవడంతో పొలాలను దుక్కి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి సూచించారు. విత్తనాలను వేసే ముందు వాటిని శుద్ధి చేసుకోవాలన్నారు. చదును నేలలైతే నీరు అన్ని ప్రదేశాలకు ఒకేలా ఉంటుందన్నారు. వాలుగా ఉండే భూముల్లో నేలకోత ఎక్కువగా ఉంటుందన్నారు. వాలుగా ఉండే భూముల్లో నీటి నిల్వ శక్తి తగ్గిపోవడంతో పాటు భూసారం తక్కువగా ఉంటుందన్నారు. దీనివల్ల పంట దిగుబడులు కూడా తగ్గిపోతాయన్నారు. ఈ కారణంగా వాలు ఎక్కువగా ఉన్న నేలల్లో వాలుకు అడ్డంగా సేద్యం చేపట్టాలన్నారు. అలాగే పంట సాగుచేసిన పొలంలో సమాంతరంగా ఉండే భూముల్లో నేల కోత తక్కువగా ఉండి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. వాలు తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే గట్లును నిర్మించుకోవాలని సూచించారు. చదును నేలలైతే పంట దిగుబడులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు.



గరుగుబిల్లిలో దుక్కులు చేస్తున్న రైతులు

శిష్టకరణ సంఘం చేయూత

కురుపాం: కురుపాం గ్రామానికి చెందిన ప్రైవేటు ట్యూషన్ మాస్టార్ పెదపెంకి వెంకటరమణ కుటుంబానికి జిల్లా శిష్టకరణ సంఘం సభ్యులు అండగా నిలిచారు. వెంకటరమణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆ కుంటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న శిష్టకరణ సంఘం సభ్యులు రూ.13,500లు నగదుతో పాటు రేషన్ బియ్యాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయబాబు, జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ పట్నాయక్, రాష్ట్ర కార్యదర్శి కుప్పిలి శ్రీనివాసరావు, రేగ సురేష్, ఉపాధ్యక్షుడు సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న శిష్టకరణ సంఘం సభ్యులు

కుట్టు శిక్షణ ప్రారంభం

గరుగుబిల్లి: హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.రవికుమార్ అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. మహిళలు కుట్టుశిక్షణతో జీవనోపాధి పొందాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఆర్.ధనుంజయ నాయుడు, జి.త్రినాథనాయుడు తదితరులున్నారు.



కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

ఎమ్మెల్యే పరామర్శ



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని మంతినివలసకు చెందిన గొర్లి సునీత (25) ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆదివారం పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆమె ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, సర్పంచ్ గార్ల సుజాత, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఆకుల శ్రీధర్, షేక్ నూర్జెల్ల తదితరులు ఉన్నారు.

జీడిపరిశ్రమ ఏర్పాటు హామీపై హర్షం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో జీడి పరిశ్రమ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ పట్ల మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులు పండించే జీడిపంటకు మద్దతు ధర కల్పించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో పాటు జీడి ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తూ ప్రైవేటు వ్యాపారుల అక్రమాల నుంచి తప్పించాలని ఎన్నో ఏళ్లుగా గిరిజన రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. గత నెల 28న అమ్మఒడి నాలుగో విడత నగదు జమ చేసే కార్యక్రమానికి కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీతో సమస్యకు పరిష్కారం దొరికిందని గిరిజన రైతులు సంతోషిస్తున్నారని అన్నారు. జీడి రైతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు.

వీరఘట్టం ఎస్సైగా వెంకటరమణ



వీరఘట్టం: పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎం.వెంకటరమణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని క్రైమ్ పరిస్థితిపై సిబ్బందితో సమీక్షించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా నడచుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

ఎకరాకు రూ.10వేలు సాగుసాయం అందించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు

భామిని: మండల కేంద్రంలో రైతు సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.లక్ష్మిపతినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బుడిత అప్పలనాయుడు రైతు సమస్యలపై మాట్లాడారు. సాగు ఖర్చులు పెరగడంతో పాటు గిట్టుబాటు ధరలు రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు ఎకరాకు రూ.10వేలు చొప్పున పెట్టుబడి సాయం అందించాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఉద్యమానికి సమాయత్తం అవుతున్నట్లు ప్రకటించారు. ఈ నెల 9 నుంచి రైతు సమస్యల జీపుజాతాను భామిని నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు గురుగుబిల్లి అప్పలనాయుడు తెలిపారు.

తండ్రి సమాధికి ఎమ్మెల్యే నివాళులు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లిలో ఎమ్మెల్యే జోగారావు తన తండ్రి ఎ.సత్యం సమాధి దగ్గర ఆదివారం నివాళులర్పించారు. తండ్రి 16వ వర్ధంతి సందర్భంగా స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన నివాళులర్పించారు. గతంలో చిలకలపల్లి సర్పంచ్‌గా తండ్రి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

విధినిర్వహణలో చిత్తశుద్ధి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్జీదారులకు అందించాల్సిన ధ్రువపత్రాలు సిద్ధం చేయటంలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. డిప్యూటీ తహసిల్దార్ బి.బుచ్చయ్య నేతృత్వంలో అధికారులు, సిబ్బంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ప్రజలు కోరుతున్న కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు భూ సంబంధిత పాస్ పుస్తకాలు, ముటేషన్లకు సంబంధించిన పత్రాలు సిద్ధం చేసేందుకు ఆదివారం కూడా విధులకు హాజరయ్యారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి ఏలాం సెంటర్, వైఎస్సార్ సెంటర్ల వద్ద సీఐ మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన పత్రాలు లేని వాహనచోదకులపై అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీఐ సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై శివప్రసాద్ ఉన్నారు.

ఎంఈఓల నియామకం

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంఈఓ పోస్టుల భర్తీ పూర్తయింది. ఆదివారం జరిగిన కౌన్సిలింగ్‌లో పాలకొండ మండల ఎంఈఓ–1గా పర్రి కృష్ణమూర్తి, వీరఘట్టంకు ధనుకొండ గౌరినాయుడు, భామిని మండలానికి అధికారి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటికే ఈ మూడు మండలాల్లో ఎంఈఓ–2 పోస్టులను భర్తీ చేయగా.. ప్రస్తుతం ఎంఈఓ–1 పోస్టు కూడా భర్తీ అయింది. సీతంపేట మండలంలో ఇప్పటికే ఇద్దరు ఎంఈఓలను నియమించారు.



కృష్ణమూర్తి



గౌరినాయుడు



శ్రీనివాసరావు

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



సంతకవిటి: జి.ఎన్.పురంలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

రేగిడి: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎల్–2 అధికారి గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో రైతులకు బీజామృతంతో విత్తనశుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. ఇలా విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, చీడపీడలు బారిన విత్తనాలు పడకుండా ఉంటాయని, తద్వారా పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పి.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం గ్రామంలో విత్తనాల శుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పైల నవీన్ మాట్లాడుతూ పొలంలో విత్తనాలు జల్లే ముందు బీజామృతంతో వాటిని శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటకు రసాయన ఎరువులు అవసరం ఉండదన్నారు. ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు. అలాగే మొలకశాతం కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఈశ్వరరావు, వీపీఏ జి.విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు, బాడంగి, లక్ష్మీపురం, ముగడ, గొల్లాది గ్రామాల్లో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పొలంలో వీటిని చల్లేముందు ఇలా శుద్ధి చేయడం వల్ల విత్తనాలకు తెగుళ్లు, చీడపీడలు సోకవని, అలాగే మొలక శాతం పెరుగుందని తద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వై.ఈశ్వరరావు, తులసి పాల్గొన్నారు.

అధికలోడు వాహనాలతో ప్రమాదం



రాజాం: పట్టణంలో నిబంధనలు అతిక్రమించి మరీ ట్రాక్టర్లు, లగేజీ ట్రాలీల ప్రయాణాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా ఇటుక లోడు ట్రాక్టర్లు డబుల్ లోడుతో రోడ్డు మీదుగా వెళ్తుండడంతో అదుపుతప్పి పడిపోతున్నాయి. ఫలితంగా దాని వెనక నుంచి వాహనదారులపై వాహనంతో పాటు ఇటుకలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, వీటిని నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.